15032024-DIS-04_Layout 1 3/15/2024 1:04 AM Page 1





'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# అంధకారం.. ఆగమాగం

**కొత్త** ప్రభుత్వం కొలువుదీరిన మూడు నెలల్లోనే తెలంగాణ ఆగమాగమైపోయింది. మొన్నటిదాకా అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచిన మన రాష్ట్రం ఆత్మహత్యల తెలంగాణగా మారిపోతున్నది. నిరాశ నీడల్లో కొట్టుమిట్టాడుతున్నది. కాంగ్రెస్ ఊదరగొట్టినట్టు మార్పు అయితే వచ్చింది. కానీ, అది మంచికి మాత్రం కాదని తేలిపోతున్నది. కాంగ్రెస్ పాలనలో జనజీవనం అతలాకుతలం అయిపోతున్నది. ఉచితాల హామీలు గుప్పించి, అవకాశం ఇస్తే అందలం ఎక్కిస్తామని ఊరించి, ఉబ్బించి అధికారంలోకి వచ్చింది హస్తం పార్టీ. అధికారపు యావతో ఇచ్చిన హామీల పర్యవసానాలను ఆ పార్టీ ఊహించలేదని జరుగుతున్న పరిణామాలు తెలియజేస్తున్నాయి. ప్రజల్లో వ్యక్తమవుతున్న నిస్పృహే అందుకు సాక్ష్యంగా నిలుస్తున్నది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మంచిదే కావచ్చు. కానీ, ఆటోడ్రైవర్ల బతుకులు ఏం కావాలనేది ప్రభుత్వ పెద్దలెవరూ ఆలోచిస్తున్నట్టు లేదు. వారి వృత్తి మీద పిడుగుపడటంతో చాలామంది ఆత్మహత్యే శరణ్యమనుకుంటున్నారు. ఇప్పటికే 20 మందికి పైగా ఆటోడ్రైవర్లు బలవన్మరణం పాలయ్యారు. మరోవైపు నేతన్నల ఆత్మహత్యలు మళ్లీ మొదలయ్యాయి. చేతివృత్తులతో సహా అన్ని రంగాలకు చెందిన సామాన్య ప్రజలు మారిన పరిస్థితుల్లో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

మన సమాజ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయ రంగం చుట్టే అల్లుకుని ఉంటుంది. అందుకనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుగా దృష్టి నిలిపింది వ్యవసాయంపైనే. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల కరెంటు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సక్రమ సరఫరా, చివరి గింజ దాకా పంటల కొనుగోలు వంటి సమగ్ర చర్యల ద్వారా కేసీఆర్ ప్రభుత్వం సాగును బాగు చేసింది. దిగుబడులను ఇబ్బడిముబ్బడిగా పెంచి రాష్ట్రాన్ని అన్నపూర్ణగా మార్చింది. అయితే కాంగ్రెస్ హయాంలో ఇప్పుడు వ్యవసాయమే నిరాదరణకు గురవుతున్నది. కరెంటు, సాగునీరు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. చేసేదేమీ లేక రైతులు ఎండిపోతున్న పొలాల్లోకి పశువులను తోలుతున్నారు. పెట్టుబడి సాయం అందక, అప్పులు పెరిగిపోయి రైతన్నలు ప్రాణాలు బలి పెట్టుకుంటున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న రైతుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. అయినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువైపోవడం విషాదకరం. కేసీఆర్ సర్కార్ చేసిన అప్పులను తప్పులుగా చూపించే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ తన అనాలోచిత విధానాలతో సాగు సడుగులు విరగ్గొట్టింది. నిన్నటిదాకా నిండుకుండల్లా కళకళలాడిన చెరువులు, కాలువలు ఎండిపోతున్నాయి. ఉబికి వచ్చిన భూగర్భజలాలు మళ్లీ లోతుల్లోకి జారిపోతున్నాయి. బోర్లతో అదృష్టాన్ని పరీక్షించుకునే పాత రోజులు మళ్లీ దాపురించాయి. రకరకాల సమస్యలు చుట్టుముట్టడంతో సాగు విస్తీర్ణం మూడు నెలల్లోనే దారుణంగా పడిపోయింది. ఉన్న ఆ కాస్త పంటలకూ కరెంటు, నీళ్లు ఇవ్వలేక కాంగ్రెస్ సర్కారు చతికిలపడుతున్నది. చేతులెత్తేస్తున్నది.

కరెంటు కష్టాలు వ్యవసాయాన్నే కాదు, మొత్తంగా రాష్ట్రాన్నే చుట్టుముట్టాయి. మంత్రులు పాల్గొనే సభలు, సమావేశాల్లోనూ కరెంటు కోతలు వెక్కిరిస్తుండటమే ఇందుకు ఉదాహరణ. ఈ సమస్యలకు తోడు తాగునీటి సమస్య తలుపు తడుతున్నది. గత పదేండ్లుగా నీటి సమస్య చూడని రాజధాని నగరం హైదరాబాద్ తాగునీటి సమస్య ముంగిట్లో నిల్చున్నది. బెంగళూరు దుస్థితి మనకు రావద్దని సాక్షాత్తూ రాష్ట్ర హైకోర్టు చేసిన హెచ్చరికలు ప్రభుత్వం చెవికెక్కాయో లేదో తెలియడం లేదు. అన్నిటికీ గత ప్రభుత్వంపై నిందలు వేసి పబ్బం గడుపుకొనే సమయం దాటిపోయిందని ప్రభుత్వ పెద్దలు గుర్తించాలి. లంకెబిందెల గురించి చౌకబారు సాకులు మాని, సమస్యలకు పరిష్కారాలు అన్వేషించాలి. కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతున్న సాగుకు ఊపిరిపోయాలి. ప్రజలకు ఊరటనిచ్చేందుకు సత్వర చర్యలు చేపట్టాలి. డంబాచారపు హామీల సంగతి తర్వాత, కనీస సౌకర్యాలను సక్రమంగా సమకూర్చడంపై పాలకులు దృష్టిపెట్టాలి.

# జారుడు బండపై నిలబడి రాళ్లతో దాడా?

రెండు దశాబ్దాల కిందట ఆనాటి రహస్య రాజకీయ పోరులో పని చేస్తున్న నాయకుడొకరు 'జారుడుబండ మీద' అనే పుస్తకం రాశారు. ములుగు జిల్లా పరిషత్ చైర్మన్, దివంగత కుసుమ జగదీశ్‌తో పాటు కొంతమంది మిత్రులం కలిసి విలువైన ఆ పుస్తకంపై ఒక రాత్రంతా చర్చించిన ఘటన ఇప్పటికీ జ్ఞాపకం ఉంది. వ్యక్తులు గానీ, వ్యవస్థ గానీ జారుడుబండ మీద కోరి నిలబడ్డ తర్వాత అంతిమ గమ్యం పాతాళమే అవుతుందని.. గుండెల్ని మెలేసే, ఉక్కిరిబిక్కిరి చేసే అనేక ఉదాహరణలతో పుస్తకంలో వివరించారు రచయిత. ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ నేతల మాటలు, చర్యలు చూస్తుంటే మళ్లీ ఆ పుస్తకం గుర్తుకొచ్చింది.

వ్యవస్థల హననానికి, ఉద్యమాల దహనానికి పాల్పడిన పార్టీలే ప్రవచనాలు వల్లిస్తుంటే.. ఊసరవెల్లి కూడా తనను మించిన మోతుబరులొచ్చారని ఉలిక్కిపడకుండా ఉండలేదేమో? ఏడు దశాబ్దాల దేశ రాజకీయాలను, పాలన యంత్రాంగాలను ప్రజాప్రయోజనాలకు దూరంగా లాక్కెళ్లిన ఘనులే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు. గురివింద గింజ తన కింద నలుపెరగదన్నట్లుగా కాంగ్రెస్ సర్కార్ నీళ్లు లేని బావిలో ఈత కొట్టేందుకు తంటాలు పడుతుంటే, మెట్ల మీద కూర్చొని చప్పట్లు కొట్టే మిత్రుడిలా బీజేపీ వ్యవహరిస్తున్నది. జారుడుబండ మీద నిలబడి ఇతరులపై రాళ్లు విసిరే దిగజారుడుతనాన్ని హస్తం, కమలం పార్టీలు ప్రదర్శిస్తున్నాయి.



డాక్టర్ ఆంజనేయ గౌడ్
98853 52242

కృష్ణా ట్రిబ్యునల్, మేడిగడ్డ, పాలమూరు-రంగారెడ్డి అంశాలను చర్చకు తీసుకొచ్చి, వాటిపై అవగాహన లేక తెల్లమొహం వేసిన హస్తం ప్రభుత్వం.. తాజాగా ఫోన్ ట్యాపింగ్ డ్రామాతో మీడియాకు లీకులిస్తూ గత ప్రభుత్వంపై బురదజల్లే ఎత్తులను కొనసాగిస్తున్నది. సొంత సామాజికవర్గానికి చెందినవారినే ఇంటెలిజెన్స్ చీఫ్‌తో పాటు కీలక అధికారులుగా నియమించుకున్న రేవంత్‌రెడ్డి.. గత ప్రభుత్వంలో కుట్రలు జరిగాయని వారితో ఆరోపణలు చేయిస్తే విలువ ఉంటుందా? సున్నితమైన ఇంటెలిజెన్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్, ఎస్ఐబీల పనిలో కూడా తలదూర్చి, నిందలను నిజం చేసేందుకు వాటిని కూడా వాడుకోజూడటం రాజనీతి అనిపించుకుంటుందా? నిజానికి ట్యాపింగ్‌లు, కోవర్టుల సంప్రదాయానికి నాంది పలికిందే కాంగ్రెస్, బీజేపీలు కదా. మొన్నటికిమొన్న దేశాన్ని కుదిపేసిన పెగాసస్ స్పైవేర్ వివాదంలో మోదీ సర్కారే అనుమానాల బోనులో దోషిగా నిలబడింది కదా. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన ఎన్నో వాస్తవాలను బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్యస్వామి బట్టబయలు చేశారు కూడా. కేంద్రమంత్రులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ఆర్ఎస్ఎస్ ముఖ్యులు, పాత్రికేయుల ఫోన్లు ట్యాపింగ్‌కు గురయ్యాయని కాషాయ సర్కార్‌పై ఆరోపణలు రాలేదా? దీనికి తోడు విమర్శకులను టార్గెట్ చేసే లక్ష్యంతో ఐదేండ్ల పాటు కస్టమర్ల డాటా నిల్వ ఉంచాలని వీపీఎన్ ప్రొవైడర్లకు కేంద్రం హుకుం జారీ చేసి, బుద్ధిజీవుల ముందు అభాసుపాలైంది కదా!

కమలం పార్టీ బురద రాజకీయాల్లో వికసించినట్టే, హస్తం పార్టీ కూడా అరచేతులతో మలినమే ఎత్తుకున్నది. 2021లో రాజస్థాన్‌లోని కాంగ్రెస్ సర్కార్.. డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ సహా సొంత పార్టీ ఎమ్మెల్యేల ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నదనే ఆరోపణలు వచ్చాయి. ఆ రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యే వేద్ ప్రకాశ్ సహా అనేక మంది నేతలు అశోక్ గెహ్లాట్ సర్కార్‌పై ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు చేశారు. రాజకీయాల్లో వీడు తుక్కా కాదు, వాడు ఉక్కా కాదని తెలంగాణ కవి చెరబండ రాజు అన్నట్లుగా.. రాజకీయ నాయకుల కదలికలపై నిఘాలో బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు జనవాడిలో ఏ1, ఏ2 ముద్దాయిలుగానే ఉన్నాయి.

దర్యాప్తు ఏజెన్సీలతో బ్లాక్ మెయిలింగ్, బుల్డోజర్లతో బెదిరింపులకు పాల్పడటంలో కాంగ్రెస్, బీజేపీలు నాణానికి ఇరువైపులా ఉండే బొమ్మాబొరుసులుగా మారిపోయాయి. బీఆర్ఎస్ పనైపోయిందని హస్తం, కమలం పార్టీలు పలుకుతున్న ప్రగల్భాలే నిజమనుకుంటే.. రేవంత్ సర్కార్‌కు దర్యాప్తు సంస్థలు, బుల్డోజర్ల అవసరమెందుకొచ్చింది? లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయించేందుకు బీఆర్ఎస్ నేతల వెంట పడాల్సిన అవసరం కమలం పార్టీకి ఎందుకొచ్చింది? అభ్యర్థులు దొరక్క కాదా? బీఆర్ఎస్ నేతలు పార్టీ మారిన మరునాడే ఎంపీ అభ్యర్థులుగా బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రకటించే స్థాయికి దిగజారడం ఆ పార్టీల దుస్థితికి నిదర్శనం కాదా? నది వెంట పడ్డ నీటి దొంగల్లా, గులాబీ పార్టీ నేతల వెంట రెండు జాతీయ పార్టీలు పడి పరువు పోగొట్టుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర దళంగా, బలంగా, భవితకు భరోసాగా కేసీఆర్‌పై ప్రజారాశుల ప్రబలమైన విశ్వాసం సన్నగిల్లకపోవడం వల్లనే కదా.. కలిసికట్టుగా కాంగ్రెస్, బీజేపీలు గులాబీ గూటి లోంచి కేసీఆర్ శిష్యులను ఎగరేసుకుపోయేందుకు పన్నాగాలు పన్నుతున్నాయి. రాష్ట్ర బీజేపీ, కాంగ్రెస్ నాయకత్వ మాటతీరులోనే పరమానందయ్య శిష్యుల విజ్ఞానం వెల్లివిరుస్తున్నది. ఇటీవల మోదీని పెద్దన్నగా స్వీకరించిన సీఎం రేవంత్‌రెడ్డి.. పట్టపగలే తాను నరేంద్రమోదీ వద్ద రోబోననే నిజాన్ని తేటతెల్లం చేశారు. పైగా పెద్దన్నగా సంబోధిస్తే తప్పేంటని హస్తం, కాషాయం నేతలు వ్యాఖ్యానించడం విషయ పరిజ్ఞానం ఉన్నోళ్లకు నవ్వులు తెప్పించింది. పెద్దన్న పాత్ర అంటే పెత్తనం చెలాయించి, సోదరుల సొమ్ములూ ఊడ్చేసే నైజమని వారికెవరు చెప్పాలి? అమెరికాను పెద్దన్న పాత్ర పోషించడం ఆపాలని వర్ధమాన దేశాలెందుకు నిలదీస్తున్నాయో హస్తాదులు, వస్త్రాదులకు వివరించే శక్తి ఎవరికీ లేనేలేదు.



బ్రేకింగ్ న్యూస్‌ల కోసం బొక్కబోర్లా పడుతున్న సీఎం రేవంత్ తీరు, విస్తరణ కోసం వత్తాసు పలుకుతున్న బీజేపీ ధోరణి తెలంగాణ రాజకీయాల్లో విలువలను బలిపీఠమెక్కిస్తున్నాయి. నిన్నటికి నిన్న కాంగ్రెస్‌కు అడ్డొస్తే బస్సు మీదికెక్కించి తొక్కిస్తానని సీఎం మాట్లాడటం సబబేనా? 90 లక్షలకు పైగా అర్హులుంటే.. సగం మందికి కూడా గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ ఇవ్వలేక, ఉచిత బస్సు ప్రయాణాన్ని అవస్థలమయంగా మార్చింది చాలక, ప్రతి మహిళకు నెలనెలా ఇస్తామన్న రూ.2500 ఎగ్గొట్టింది మరిచి, మహిళా లోకానికి అసత్యాలు బోధిస్తున్నారు.

సాగునీరు మాయమై, తాగునీరు గగనమై, మళ్లీ గ్రామాల్లో కుండల కొట్లాట తెచ్చిన రేవంత్ సర్కారును ఆడబిడ్డలు అసహ్యించుకుంటున్నారు. చేతికొచ్చిన పంటలు ఎండిపోతుంటే, ఎద గాయమై, పెంచిన పైరుకే రైతన్నలు తలకొరివి పెడుతూ అల్లాడుతున్నారు. అటువైపు దృష్టి నిలపకుండా, రేవంత్ వందిమాగధులు పగ, ప్రతీకార రాజకీయాలకే రాత్రీపగలు ఖర్చు చేస్తున్నారు.

వాస్తవానికి మహిళల కన్నీటికి కారణమై, వంటింట్లో రోదన రగిలించిందే బీజేపీ ప్రభుత్వం. డబ్ల్యూపీఐ, వినియోగదారుల ధరల సూచీ ప్రకారం.. మోదీ ప్రభుత్వ వైఫల్యం వల్ల గడిచిన పదేండ్లలో నిత్యావసర సరుకుల వారాంత వ్యయం 68 శాతం పెరిగింది. ద్రవ్యోల్బణం, కరెంట్ కోతల వల్ల పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తిలో కోత పడి, ఆదాయానికి గండి పడి, సామాన్యుడి నిత్య జీవితం సంక్షోభంగా మారిందని అనేక నివేదికలు తేటతెల్లం చేశాయి. పైగా పెద్ద నోట్ల రద్దు, కరోనా సమస్య ఉపాధికి ముప్పుగా మారి, జనాల జేబుల్లో అప్పుల పత్రాలు నింపాయి. మోదీ ఆర్థికమంతా తప్పయి, దేశమంతా అప్పు అయ్యింది. దశాబ్దంలోనే మోదీ సర్కార్ రూ.100 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల హెచ్చరికలకూ కారణమైంది. దీనికి తోడు గడిచిన నలభై ఏండ్లలో దేశంలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగిత పెరిగిపోయింది. దేశంలో 60 లక్షలకు పైగా కొలువుల ఖాళీలుంటే.. మోదీ ప్రభుత్వం పదేండ్లలో 6.9 లక్షల ఉద్యోగాలనే భర్తీ చేసింది. ఏటా రెండు కోట్ల కొలువుల భర్తీ హామీ, ఖాతాల్లో రూ.15 లక్షల జమా జుమ్లాతో గద్దెనెక్కిన కమలేషులు, దేశవాసులను కుల్లబొడిచారే గానీ, ఆదెరువు చూపిందెక్కడ? ఇలాంటి ఎన్నో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు నరేంద్రుడి సోదరుడైన రేవంత్‌రెడ్డికి కనపడనే కనపడవు. కానీ ఆడపడుచుల ఆనందమయ జీవితం కోసం అహోరాత్రులు శ్రమించి, మానవీయ పథకాలెన్నో అమలు చేసిన కేసీఆర్ ప్రభుత్వంపై మాత్రం నిద్రలో సైతం ఆడిపోసుకుంటున్నారు. కేసీఆర్ సర్కార్ అమలు చేసిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, పౌష్టికాహార కిట్, ఆడపిల్ల పుడితే నగదు సహాయం వంటి పథకాలు బాలికల భవితకు బంగారు బాటలు వేశాయని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి 2023 జూలై 24న ప్రశంసించిన సత్యాన్ని నాటి దిన పత్రికలను మరోసారి తిరగేసి పాలకులు తెలుసుకోవాలి. బాలికల గురుకులాలు, షీ టీమ్‌లు తదితర ఎన్నో మహిళాభ్యుదయ పథకాలు అమలు చేసి, మార్కెట్ కమిటీల్లో సైతం రిజర్వేషన్లు కల్పించి ఆడబిడ్డలకు ఆకాశమే హద్దుగా ఎదిగేందుకు తొవ్వ చూపారు నాటి సీఎం కేసీఆర్. అసలు బీఆర్ఎస్ పార్టీ జెండా రంగు ఎంపికలోనే మహిళా పక్షపాతం ఉందనే సత్యం మొన్న ఖమ్మంలో తెలంగాణ జలవనరుల నిపుణులు వి.ప్రకాశ్ చెబితేనే తెలిసింది. తెలంగాణ విముక్తి కోసం కేసీఆర్ రాజకీయ శక్తిని రూపొందిస్తున్న తొలినాళ్లలో, జెండా రంగు ఎంపిక కోసం రెండు ఖండాల రాజకీయ పటాలను ముందేసుకొని.. 'అసలు గులాబీ రంగెందుకు? ఏ రాజకీయ పార్టీ వాడలేదు' అని ప్రశ్నించారట. గులాబీ రంగును సహజంగా మహిళలు ఇష్టపడతారని, పురుషస్వామ్య సమాజం వర్ధిల్లే విపణిలో.. 'మన పార్టీ వివక్షకు విరుగుడు కావాలి. గులాబీ రంగే వాడుదాం' అని ఆనక కేసీఆర్ ప్రకటించారట. అసలు బీఆర్ఎస్ జెండాలోనే మహిళా సాధికారత ఉంటే.. సీఎం రేవంత్ లాంటి వారు మహిళా వ్యతిరేకిగా గులాబీ పార్టీని నిందించడంలో అర్థముందా?

తెలంగాణలో న్యాయాన్యాయాల మధ్య మళ్లీ ఘర్షణ అనివార్యంగా మారింది. ఇప్పుడు జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు జాతీయ పార్టీల విస్తరణ ఉన్మాదానికి, తెలంగాణ రాష్ట్ర హక్కుల పోరాటానికి మధ్య సమరంగా మారిపోయాయి. మోదీ వందిమాగధులలో ఒకరిగా చేరిన రేవంత్‌రెడ్డి.. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీనే కాదు, తెలంగాణ రాష్ట్ర భవితను సైతం పెద్దన్న చేతిలో పెట్టేశారు. తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవాన్ని ఆపదలో పడేసే దిశగా ఆ ఇరువురూ పావులు కదుపుతుంటే.. ఎల్లరూ ఏకమై నిలువరించాల్సిన చారిత్రక సందర్భమిది. ఎండుతున్న పొలాలు, మండుతున్న రైతన్నలు మనల్ని కదలమంటున్నారు. మత్తడి దుంకిన చోట నెత్తురు పారే రాజకీయాలను మన నేల కోరుకోదు. కుట్ర రాజకీయాలను కూల్చే ప్రజాస్వామిక పరిణతిని తెలంగాణ నలుచెరుగులా ప్రదర్శించాలి. పార్లమెంట్‌కు ఢిల్లీ దూడా బసవన్నలను ఎలా పంపించగలం? ప్రాంతమే ప్రాణంగా పోరాడే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే నెగ్గాలి. తెలంగాణ రాష్ట్ర సచివాలయాన్ని ప్రారంభించిన రోజు పాడి పాడి అలసిపోయిన అమరుడు సాయిచంద్.. వేదిక వెనుక నాతో ఒకమాటన్నాడు. 'అన్నా.. పెద్ద సారు మన కుంటేనే రక్షణనే. కొట్లాడేటోల్లం, కేసీఆర్‌తో కొన ఊపిరి దాకా ఉందాం' అని అన్నాడు. మిత్రుడు, పాలమూరు పొత్తిళ్ల పంట సాయి మాటలే తెలంగాణకు శాశ్వత కొలమానాలు. బీఆర్ఎస్ ఖాళీ కాదు, కొత్త నెత్తురై పోరు నదిలా పరవళ్లు తొక్కుతుంది.

(వ్యాసకర్త: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)

# జననేత.. ఆరోగ్య ప్రదాత

సుప్రసిద్ధ వైద్యులు, ప్రజానాయకుడు మాజీ ఎమ్మెల్యే నెమురుగొమ్ముల సుధాకర్‌రావు పేదల కోసం పరితపించిన మహోన్నతమైన వ్యక్తి. పేదల డాక్టర్‌గా పేరుగాంచిన ఆయన ఎందరినో ఆదుకున్నారు. సుధాకర్‌రావు ఎంతటి ఉన్నత విద్యావంతుడో రాజకీయాల్లో అంతటి నిరాడంబరుడు. వైద్య రంగంలో గొప్ప మేధావి. పరిపాలనలో గొప్ప రాజనీతిజ్ఞుడు.



నివాళి

డాక్టర్ సుధాకర్‌రావు

మాజీ మంత్రి దివంగత నేత ఎన్.యతిరాజారావు-విమలాదేవిల మొదటి సంతానమే సుధాకర్‌రావు. 1950 ఏప్రిల్ 3న నాటి కొడకండ్ల మండలంలోని వడ్డేకొత్తపల్లిలో ఆయన జన్మించారు. 1975లో హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజీ నుంచి ఎంబీబీఎస్ పట్టా పొందిన ఆయన.. 1984లో పోస్టు గ్రాడ్యుయేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎండోక్రైనాలజిస్ట్ పూర్తి చేశారు. తెలంగాణ పట్ల అమితమైన ప్రేమ ఉన్న సుధాకర్‌రావు వైద్య విద్యార్థిగా ఉన్నప్పుడే 1969లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. అనంతరకాలంలో గాంధీ దవాఖానలో హెచ్‌వోడీగా, సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించి పేదలకు సేవలు అందించారు. తండ్రి యతిరాజారావు రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న సుధాకర్‌రావు 1999లో టీడీపీలో చేరి చెన్నూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. నాటి చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధిలో సుధాకర్‌రావు పాత్ర మరువలేనిది. ఓవైపు ప్రజాప్రతినిధిగా నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూనే.. మరోవైపు వైద్యుడిగా సేవలందించిన సవ్యసాచి డాక్టర్ సుధాకర్‌రావు.

33 ఏండ్లుగా పలు ఆసుపత్రుల్లో వైద్య సేవలను అందించిన సుధాకర్‌రావు జాతీయ, అంతర్జాతీయ వైద్య బృందాలు, కమిటీల్లో సభ్యుడిగానూ కొనసాగారు. డయాబెటిక్ అంశంపై 8 పరిశోధనా పత్రాలను అందించి ఎందరికో మార్గనిర్దేశం చేసిన మహనీయుడాయన. ఆయన అందించిన సేవలకుగానూ అనేక పురస్కారాలు అందుకున్నారు. 2014లో ఎండోక్రైనాలజీలో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు, 2016లో డయాబెటిక్ విభాగంలో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులూ పొందడం విశేషం.

2004 ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజా సేవకే అంకితమయ్యారే తప్ప వెనుకడుగు వేయలేదు. తెలంగాణ సాధనలో తనవంతు పాత్ర పోషించాలనే ధ్యేయంతో కేసీఆర్ నాయకత్వంలో అప్పటి టీఆర్ఎస్‌లో చేరి మలిదశ ఉద్యమంలోనూ పాల్గొన్నారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం టీఆర్ఎస్ తరఫున పోటీ చేసినా ఓటమిపాలయ్యారు. అయినప్పటికీ చివరి శ్వాస వరకు కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ బీఆర్ఎస్‌లోనే కొనసాగారు. డాక్టర్ సుధాకర్‌రావు మరణంతో తెలంగాణ గొప్ప వైద్యున్ని, మేధావిని కోల్పోయింది. పేదల డాక్టర్ సాబ్‌గా ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారు.



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99891 48305

కాంగ్రెస్ నేతృత్వంలోని రేవంత్ సర్కార్ తీరుతెన్నులు చూస్తుంటే ఉమ్మడి ఏపీ పాలన గుర్తుకువస్తున్నది. నాడు ఉమ్మడి పాలకులు ఒక్క ప్రాజెక్టును నిర్మించకుండా కరవుకు కారణమైతే, నేడు నీళ్లున్నా ఇవ్వకుండా రేవంత్ కరవును ఆహ్వానిస్తున్నారు. కాంగ్రెస్ సర్కార్ పగ్గాలు చేపట్టిన మూడు నెలలకే మళ్లీ నాటి పరిస్థితులు కనిపిస్తుండటంతో భవిష్యత్తును తల్చుకుంటూ కర్షకులు కకావికలమవుతున్నారు.

# నాటి గోస గుర్తుకొస్తున్నది



కత్తుల శ్రీనివాస్‌రెడ్డి
91827 77027

యాసంగి పంట చేతికి వచ్చే పరిస్థితి కనిపిస్తలేదు. వచ్చీపోయే కరెంటు రైతన్నలను వెక్కిరిస్తున్నది. దీంతో మార్చిలోనే రాష్ట్రవ్యాప్తంగా కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. రైతుబంధు మొత్తం వేయడానికే రేవంత్‌రెడ్డి సర్కార్ ఆపసోపాలు పడుతున్నది. కేసీఆర్ సర్కార్‌పై అభాండాలు వేయాలనే ఏకైక లక్ష్యంతో రైతన్నలను అరిగోస పెడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. అందులో భాగంగానే కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లున్నా విడుదల చేయడం లేదు. ఫలితంగా రాష్ట్రంలో నీళ్ల పంచాయితీలు మొదలవుతున్నాయి. ఇటీవల సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని వింజపల్లిలో అన్నాదమ్ముళ్ల మధ్య సాగునీరు తగవు పెట్టింది. ఈ గొడవలో తమ్ముడు మరణించడం విచారకరం. పంటలను కాపాడుకునేందుకు రైతులు ఎంతకైనా తెగిస్తున్నారనడానికి ఈ ఘటనే నిదర్శనం.

చేతికొచ్చిన పంటలను కాపాడుకునేందుకు రైతులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. గంగమ్మను ఒడిసిపట్టేందుకు 600 ఫీట్ల వరకు బోర్లు వేస్తున్నారు. గత పదేండ్లుగా ఎవుసం సాఫీగా సాగిన తర్వాత ఒక్కసారిగా చుట్టుముట్టిన కష్టాలతో రైతులు సతమతమవుతున్నారు. నిత్యం పొలాల వద్దే ఉంటూ వరుస తడులతో నీళ్లు పారిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా పారిస్తున్నప్పటికీ ప్రయోజనం ఉండటం లేదు. ప్రస్తుతం వరి చేనులన్నీ పొట్ట దశలో ఉన్నాయి. ఈ దశలో వరికి పుష్కలంగా నీళ్లుండాలి. ఎంత నీరుంటే అంతగా పంట దిగుబడి వస్తుంది.

మొన్నటివరకు మూతపడ్డ మెకానిక్ షాపులు కాంగ్రెస్ హయాంలో మళ్లీ కళకళలాడుతున్నాయి. ఏ షాపు చూసినా రద్దీగానే కనిపిస్తున్నది. ఒక్కో మెకానిక్ రోజుకు సరాసరిగా ఎంత లేదన్నా 10-15 మోటర్లు రిపేరు చేస్తున్నారు. గత పదేండ్లుగా చీకటిలో మగ్గిపోయిన తమ జీవితాల్లో రేవంత్ సర్కార్ వెలుగులు నింపిందని మెకానిక్‌లు సంబురపడుతుండటం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. అనతికాలంలోనే రైతు వ్యతిరేక ప్రభుత్వంగా రేవంత్ సర్కార్‌పై ముద్రపడింది. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు చేయకపోవడంతో రైతులు కన్నెర్ర జేస్తున్నారు. బ్యాంకర్లు పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. కొంతమంది రైతులకు నోటీసులు కూడా జారీ చేస్తున్నారు. రూ.2 లక్షల రుణమాఫీ హామీ ఏమైందని ఎక్కడికక్కడ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను అన్నదాతలు నిలదీస్తున్నారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉన్నందున ఎన్నికల కోడ్ పేరు చెప్పి రైతుల నోట్లో మట్టి కొట్టాలని రేవంత్ సర్కార్ చూస్తున్నదనే వాదన కూడా వినిపిస్తున్నది. ఇటు పంట పెట్టుబడి అందక, అటు బ్యాంకర్ల ఒత్తిడితో కర్షకులు సతమతమవుతున్నారు. కష్టాల వేళ భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడంతో రైతులు భయాందోళనలో ఉన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసింది. కాళేశ్వరం జలాలతో బీడు భూముల్లో బంగారం పండింది. కేసీఆర్ పాతాళంలో ఉన్న గంగమ్మను 618 మీటర్ల ఎత్తులో ఉన్న కొండ పోచమ్మ రిజర్వాయర్‌కు తీసుకువచ్చి నెర్రెలు బారిన భూమి దూప తీర్చారు. పల్లెలన్నీ పచ్చగా కళకళలాడినయి. అందరికీ చేతినిండా పని దొరికేది. మన చేలల్లో పనులు చేసేందుకు పక్క రాష్ట్రాల నుంచి కూలీలు వలసలు వచ్చారు. కానీ, నేడు మన రాష్ట్రం నుంచే ఇతర రాష్ట్రాలకు కూలీలు వలసలు వెళ్తున్నారు. నలుగురికి అన్నం పెట్టిన మన రైతన్న వలస పక్షిగా మారడం విషాదకరం.

# కేసీఆర్ ఉండుంటే.. ఈ కష్టాలుండేవా?



జి.రాజేష్ నాయక్
96035 79115

'కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మోసపోయాం. హస్తం పాలనలో గోస పడుతున్నాం' అనే మాట తెలంగాణలోని ప్రతిఒక్కరి నోట వినిపిస్తున్నది. అనతికాలంలోనే 'కేసీఆర్ సర్కారే ఉండుంటే మాకు ఈ కష్టాలు ఉండకపోవు' అనే చర్చ కూడా ప్రజల్లో మొదలైంది.

ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక సతమతమవుతున్న రేవంత్‌రెడ్డి సర్కార్ ఆ నెపాన్ని కేసీఆర్‌పై నెట్టాలని చూస్తున్నది. అందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేసీఆర్ సర్కార్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తూ.. ఆయన గుర్తులను చెరిపేస్తాననే పాటందుకున్నారు. అయితే కాంగ్రెస్ పాలకులకు తెలియనిదేమిటంటే.. తెలంగాణ నుంచి కేసీఆర్‌ను వేరు చేయడం ఎవరి తరం కాదనే విషయం. కేసీఆర్‌ను, తెలంగాణను వేరు చేసి చూడలేం. పద్నాలుగేండ్ల పాటు ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని నడిపిన కేసీఆర్ ప్రజలతో అంతగా మమేకమయ్యారు. ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకున్నారు. తెలంగాణలో ఆయన నడవని నేల లేదు. తొక్కని గడప లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే.. తెలంగాణ అణువణువు ఆయనకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు.



ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ అవతరించాక కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యమిచ్చింది. అందుకే తొమ్మిదేండ్ల స్వల్ప వ్యవధిలోనే మన రాష్ట్రం అనేక రంగాల్లో ప్రగతి సాధించింది. తెలంగాణను వివిధ రంగాల్లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలపడమే కాకుండా, అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన కేసీఆర్ గుర్తులు చెరిపితే చెరిగేవి కావు. అధికారం కోల్పోయినంత మాత్రాన.. ప్రజల గుండెల్లో ఆయన వేసిన ముద్ర చెరిగిపోదు. తెలంగాణ ప్రజలను కంటికి రెప్పలా కాపాడిన నేతపై అభాండాలు వేయడం తగదు. ఏ గుర్తులను చెరుపుతారు? పాలమూరు వలసలకు అడ్డుకట్ట వేశారనే వాస్తవాన్నా? నల్లగొండ ఫ్లోరోసిస్‌ను తరిమి కొట్టారనే నిజాన్నా?

కేసీఆర్‌పై నిందలేస్తూ కాలయాపన చేయడం మాని.. నీళ్లులేక ఎండిపోతున్న పొలాలపై పాలకులు ధ్యాస పెట్టాలి. 420 హామీలపై దృష్టి సారించాలి. పొద్దస్తమానం కేసీఆర్‌పై పడి ఏడ్వటాన్ని మేధావులు, బుద్ధిజీవులు గమనిస్తున్నారు. పంటలు ఎండిపోయి కడుపు మండుతున్న రైతులు కాంగ్రెస్‌పై ఆగ్రహంతో ఉన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అన్నదాతల ఆగ్రహజ్వాలల సెగ హస్తం పార్టీకి తగలడం ఖాయం.

